అవినీతికి కేరాఫ్ వైసిపి : బుద్దా

బొబ్బిలి : రాష్ట్రంలో అవినీతికి కేరాఫ్ గా వైసిపి నేతలు నిలుస్తారని బుద్దా వెంకన్న ఆరోపించారు. చంద్రబాబు బహిరంగ సభ స్థలాన్ని మంగళవారం పరిశీలించారు. అనంతరం కోటలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, విజయనగరం ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి చేసిన అవినీతి ఎవరూ చేసి ఉండరన్నారు. వీరంతా టిడిపి నాయకులపై ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. భోగాపురం ఎయిర్ పోర్టు పూర్తి చేయడంలో వైసిపి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. మాజీమంత్రి సుజయకృష్ణ రంగారావు మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షలాది మంది పేదలకు సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు. చంద్రబాబు పర్యటనను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి బేబినాయన, ఆర్‌పి భంజ్ దేవ్, తదితరులు ఉన్నారు.

ఓటరు నమోదు నిరంతర ప్రక్రియ

పరిశీలకులు అహ్మద్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఓటరు నమోదు పరిశీలకులు ఎ.బాబు

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఓటరు నమోదు నిరంతర ప్రక్రియని, 18-19 ఏళ్ల గల యువతను ఓటర్లుగా చేర్పించడంపై దృష్టి పెట్టాలని ఓటరు నమోదు పరిశీలకులు ఎ.బాబు అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్‌తో కలిసి ఓటరు నమోదు అధికారులు, సహాయ ఓటరు నమోదు అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. తిరస్కరించిన దరఖాస్తులకు స్పష్టమైన కారణాలను తెలియజేయాలన్నారు. 18-19 ఏళ్ల గల ఓటర్లుగా నమోదు చేయడం, బూత్ స్థాయిలో తీసుకోవాల్సిన చర్యలు, తదితర వాటిపై సమీక్షించారు. ఫారం-6, ఫారం-8 ధరఖాస్తులకు ఆమోదించి, తిరస్కరించిన కారణాలను వివరంగా, స్పష్టంగా తెలియజేయాలన్నారు. ఇప్పటికే చర్యలు తీసుకున్న ధరఖాస్తులపై వారం రోజుల్లో తిరస్కరించిన, తొలగించిన దరఖాస్తులకు సంబంధించి తగిన కారణాలను పొందుపర్చాలని తెలిపారు. గత సమావేశంలో తెలియజేసిన విషయాలపై సమీక్ష నిర్వహించారు. బూత్ లెవల్ అధికారులకు గుర్తింపు కార్డులు పంపిణీ, ఓటరు నమోదు కేంద్రాలకు బోర్డులు పెట్టడంపై తీసుకున్న చర్యలపై సంతృప్తి వ్యక్తం చేశారు. పండుగ, సెలవు దినాల్లో విద్యార్థులు అందు బాటులో ఉంటారని, కావున ఆరోజుల్లో ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని తెలిపారు. ప్రతి దరఖాస్తుపై నియోజక వర్గ ఎన్నికల అధికారులు సూపర్ చెక్ చేయాలని ఆదేశించారు. ఫారం-6 రిజెక్ట్, ఆధార్ ఫోటో అప్‌డేషన్లపై పరిశీలకులు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల కమిషన్‌కు పంపించే నివేదికలు పూర్తి వివరాలు, సమాచారంతో కూడి ఉండాలన్నారు. దరఖాస్తులపై తీసుకునే చర్యలు ఎన్నికల కమిషన్ వెబ్ సైట్ ద్వారా అందరూ తెలుసుకొనే అవకాశం ఉందని, కావున ఈ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి ఎన్నికల కమిషన్ కు మంచిపేరు తీసుకురావాలని తెలిపారు. ఎమ్మెల్సీ ఓటర్ల దరఖాస్తులు స్వీకరణ, ఆమోదం, ఓటర్ల జాబితా తయారీలో పారదర్శకంగా వ్యవహరించాలని తెలిపారు. ఓటరు నమోదు, తొలగింపు వంటి వాటిపై సందేహాలు ఉంటే ఫోన్ 9441412121 ద్వారా లేదా మెయిల్ ababu@ias.nic.in ద్వారా తనకు తెలియజేయాలని ఆయన తెలిపారు.

జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో స్వీప్ కార్యక్రమంలో 18-19 ఏళ్ల గల 1019మందిని ఓటర్లుగా చేర్పించామన్నారు. వారి నుంచి 4400 దరఖాస్తులు స్వీకరించినట్లు వివరించారు. జిల్లాలో మొత్తం 15356 దరఖాస్తులు స్వీకరించామని, 6825 ఆమోదం పొందాయని, మిగిలిన దరఖాస్తులు పెండింగు, వెరిఫికేషన్‌లో ఉన్నాయని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటరు నమోదు ప్రక్రియ సక్రమంగా జరుగుతున్నదని, ప్రతి కేంద్రం వద్ద బోర్డు ఏర్పాటు చేశారని తెలిపారు. సమావేశంలో ఐటిడిఎ పిఒలు డాక్టర్ బి.నవ్య, సి.విష్ణు చరణ్, సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్, డిఆర్‌ఒ జె. వెంకట రావు, ఆర్‌డిఒ కె.హేమలత, తహశీల్దార్లు, ఎన్నికల డిటిలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలని

గ్రీన్ అంబాసిడర్ల ధర్నా

పట్టణంలో ర్యాలీగా కలెక్టరేట్‌కు వెళ్తున్న గ్రీన్ అంబాసిడర్లు

ప్రజాశక్తి -కలెక్టరేట్

గ్రీన్ అంబాసిడర్ల వేతనాల బకాలు తక్షణమే చెల్లించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు డి రమణారావు డిమాండ్ చేశారు. జీతం బకాయి చెల్లించాలని కోరుతూ గ్రీన్ అంబాసిడర్లు మంగళవారం స్థానిక సుందరయ్య భవనం నుంచి కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి డిఆర్‌ఒకు వినతిని అందజేశారు. అనంతరం ధర్నానుద్దేశించి రమణారావు మాట్లాడుతూ పంచాయతీల్లో పని చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు ప్రతినెలా వేతనాలు చెల్లించడంలేదన్నారు. ఇప్పటికీ పది నెలలు పలువురు గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు బకాయిలు ఉన్నాయన్నారు. అసలే అరకొర వేతనాలని, అవి కూడా సకాలంలో అందక తీవ్ర ఇబ్బందులు పడుతన్నారన్నారు. తక్షణమే అధికారులు స్పందించి బకాయి జీతాలు చెల్లించేలా తీసుకోవాలని కోరారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మధరావు మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్ల కనీసవేతనాలపై జిఒ 680 జారీ చేసి మూడేళ్లయినా దాని ప్రకారం జీతాలు అమలు చేయడం లేదన్నారు. ఈ కార్మికులంతా దళితులు, గిరిజనులు, బలహీన వర్గాలకు చెందిన వారని, గ్రీన్ అంబాసిడర్లను పంచాయితీలకు అప్పచెప్పుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, దీనివల్ల పంచాయితీల నుంచి జీతాలు చెల్లించలేమని సర్పంచులు చెబుతున్నారన్నారు. కొంత మంది సర్పంచులు రూ.వెయ్యి, రూ.1500కు పనిచేయండని, లేకపోతే మానేయండని చెబుతున్నారన్నారు. ప్రభుత్వమే గ్రీన్ అంబార్లకు కి జీతాలు చెల్లించాలని, పెండింగు జీతాలు చెల్లించాలని, కనీసవేతనం రూ.10వేలు ఇవ్వాలని, మాస్కులు, శానిటైజర్లు, యూనిఫాం, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, రిక్షా మరమ్మతు ఛార్జీలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్లకు ప్రతినెలా జీతాల్లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు, ఆరోగ్యపరమైన సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిఒ 680 ప్రకారం జీతాలు చెల్లించి కార్మికుల కుటుంబా లను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రామిక మహిళా సంఘం నాయకులు వి.ఇందిరా, జిల్లాలోని గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ఉపాధ్యాయుడి అవతారమెత్తిన కలెక్టర్

ప్రజాశక్తి - కురుపాం

జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. నాడు నేడు పనులను పరిశీలించి త్వరగతిగా పనులు పూర్తిచేయాలని సంబంధిత సిబ్బందికి ఆదేశించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థుల వద్దకు వెళ్లి వారు నేర్చుకున్న అంశాలపైన, వారి సామర్థ్యాన్ని పరిశీలించి బోర్డుపై పాఠాలను బోధించి ఉపాధ్యాయుని అవతారమెత్తారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ ఇష్టంతో చదవి ఉన్నత లక్ష్యాలను పెట్టుకోవాలని, వాటిని సాధించే వరకూ కృషితో చదవాలని, చదువుతో పేదరికం దూరమై సమాజంలో పరపతి ఉంటుందని అన్నారు. కావున ప్రతి విద్యార్థి కష్టపడి రానున్న పరీక్షలలో మంచి మార్కులు సాధించేందుకు ఇప్పటి నుండే ప్రణాళికా బద్ధంగా చదవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఇఒ ఎన్.సత్య నారాయణ, ప్రధానోపాధ్యాయులు టి.శంకర్రావు పాఠశాల, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మిల్లర్ల దోపిడీని అరికట్టాలి

రైతు సంఘం నాయకులు డిమాండ్

ప్రజాశక్తి - బలిజిపేట

మిల్లర్లు, దళారీల దోపిడీ నుంచి మండలంలోని ధాన్యం రైతులను కాపాడాలని ఎపి రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు గేదెల సత్యనారాయణ, రైతు కూలీ జిల్లా సంఘం నాయకులు మామిడి సింహాద్రి నాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి ధాన్యం ఏ విధంగా కొనుగోలు చేయాలో అన్న అంశం శిక్షణ పొంది, నాణ్యతా ప్రమాణాలు చూసే అధికారులు కేంద్రాల వద్ద అందుబాటులో ఉండడం లేదన్నారు. వీరి నిర్లక్ష్యం వల్ల మిల్లర్లు క్వింటాకు అదనంగా ఐదు కేజీలు ధాన్యం దోచుకుంటున్నారన్నారు. కొనుగోలు కేంద్రాల వద్దనే నాణ్యతా ప్రమాణాలు చూడాలని, రవాణా ఖర్చులు సుమారు 10 లారీలతో కూడిన రవాణా సౌకర్యం కల్పించేందుకు ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద పూర్తి స్థాయిలో నాణ్యతా, తూనిక యంత్రాలు అందుబాటులో లేవవీ, ఉన్న సమయానికి పనికి రావని ఉన్నాయని అన్నారు. మండలంలోని జామి రవి మిల్లు వద్ద క్వింటాకు 5 కేజీలు అదనంగా తీసుకుంటున్నారని, ట్రక్ షీట్‌లో ఉన్న మొత్తం కన్నా అధికంగా 5కేజీలు ధాన్యం కొలిచి తీసుకున్నారని తెలిపారు. అక్కడ పని చేసిన గుమస్తా ట్రక్ షీట్ వెనుక పేజీలో అదనంగా తీసుకున్న ధాన్యం వివరాలు రాసి ఇచ్చినట్లు తెలిపారు. ఈ విషయం పై తహశీల్దార్‌కు ఫిర్యాదు చేయగా, తనకు సంబంధంలేదని, సిఎస్‌డిటిదే బాధ్యతని చెప్పడం ఆయన బాధ్యతారాహిత్యానికి నిదర్శనమన్నారు. రైతులపై ధాన్యం లోడు, అన్‌లోడు, రవాణా, గోనె సంచుల ఖర్చులు అదనంగా పడుతున్నాయని, వాటిని ప్రభుత్వమే భరిస్తామని చెప్పి నేడు రైతులపై భారం మోపుతున్నారని విమర్శించారు. మండల స్థాయి విజిలెన్స్ అధికారులను స్థానికంగా ఉండేలా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

భవన నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎస్‌పి విద్యాసాగర్‌నాయుడు

భవన నిర్మాణాలను పరిశీలించిన ఎస్‌పి

సాలూరు : పట్టణంలోని మక్కువ రోడ్డులో నిర్మిస్తున్న రూరల్ పోలీస్ స్టేషన్ భవనాన్ని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు మంగళవారం పరిశీలించారు. ప్రస్తుతం మండల తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో రూరల్ పోలీస్ స్టేషన్ వుంది. దాని స్థానంలో కొత్త మోడల్ పోలీసు స్టేషన్ భవనాన్ని నిర్మించారు. దీని నిర్మాణం దాదాపు పూర్తయింది. ఈ నేపథ్యంలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పోలీసు స్టేషన్ భవనాన్ని ఎస్పీ పరిశీలించారు. ఆయన వెంట సిఐలు సిహెచ్.శ్రీనివాసరావు, ధనుంజయరావు వున్నారు.

ఉపాధ్యాయ బదిలీలకు 4242 దరఖాస్తులు

విజయనగరం టౌన్ : ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి ఉమ్మడి జిల్లాలో 4242 దరఖాస్తులు జిల్లా విద్యా శాఖ కార్యాలయానికి అందాయి. వీటిని జిల్లా విద్యాశాఖ అధికారులు పరిశీలించారు. బొబ్బిలి డివిజన్‌లో 2077 దరఖాస్తులు రాగా, విజయనగరం డివిజన్‌లో 2165 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో బొబ్బిలిఓ 716, విజయనగరం డివిజన్ నుంచి 1511 దరఖాస్తులను అధికారులు పరిశీలించి ఆమోదించారు. మిగిలిన దరఖాస్తులను పరిశీలిస్తున్నట్లు డిఇఒ బి.లింగేశ్వర రెడ్డి తెలిపారు.

24న జాతీయ వినియోగదారుల దినోత్సవం

ప్రజాశక్తి - కలెక్టరేట్

జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని ఈనెల 24న నిర్వహించనున్నట్లు సంయుక్త కలెక్టరు ఒ.ఆనంద్ తెలిపారు. వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించేందుకు, వినియోగదారుల రక్షణను సాధించేందుకు కృషి చేయాలన్నారు. అన్ని ప్రభుత్వ శాఖలు, వ్యాపార సంస్థలు, పరిశ్రమలు, వాణిజ్యం సేవా ప్రదాతలు వినియోగదారుల అవసరాలను తీర్చడం ద్వారా సేవలను అందిస్తున్న వాణిజ్య పన్నులు, లీగల్ మెట్రాలజీ, ఆరోగ్యం, విద్య, రవాణా, ఆహార భద్రత, ప్రభుత్వ రంగ చమురు సంస్థలు, సి.వి.ఒ.ఎస్. వంటి వినియోగదారుల వ్యవహారాలకు సంబంధించిన విభాగాలు జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించడంలో పాలుపంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉన్నత పాఠశాలలు, డిగ్రీ కళాశాలల్లోని వినియోగదారుల క్లబ్‌ల విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ప్రతి ఏటా డిసెంబర్లో జిల్లా స్థాయిలో వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించాలని డిఇఒను ఆదేశించారు. ఉన్నత పాఠశాల స్థాయి, కళాశాల స్థాయిల్లో విద్యార్థులకు వక్తృత్వం, వ్యాస రచన పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం-2022 నేపథ్యంలోపై పోటీలను తెలుగు, ఆంగ్ల భాషల్లో నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందజేయాలని, జిల్లా స్థాయిలో అన్ని కేటగిరీలలో 1వ, 2వ, 3వ బహుమతులుగా రూ.3వేలు, రూ.2వేలు, రూ.1500 అందజేయాలని తెలిపారు. 13 జిల్లాల నుండి మొదటి బహుమతి విజేతలు హైస్కూల్/కళాశాల స్థాయిలో అన్ని కేటగిరీల వారు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల విజేతలకు రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు రూ.7వేలు, రూ.5వేలు, రూ.3వేలు నగదు బహుమతులు అందజేయబడతాయని తెలిపారు.

పేదల సంక్షేమమే లక్ష్యం

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్రం లోని పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని డిప్యూటీ సీఎం రాజన్నదొర అన్నారు. మంగళవారం ఆయన 14,15వార్డుల పరిధిలో గల చిన్న కుమ్మరి వీధి, బంగారమ్మ కాలనీల్లో ఆయన ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల లబ్ధి గురించి వివరించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సచివాలయాలకు రూ.20లక్షల చొప్పున నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు జర్జాపు సూరిబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ లు వంగపండు అప్పలనాయుడు, జర్జాపు దీప్తి, కౌన్సిలర్లు పాలవలస మధుసూదనరావు, గిరి రఘు, గొర్లి వెంకటరమణ, సింగారపు ఈశ్వరరావు, రాపాక మాధవరావు, పట్టణ మహిళా అధ్యక్షులు రాంబాయి పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని సూరంపేట సచివాలయంలో పరిధిలో గల మరిపివలసలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎ.జోగారావు మాట్లాడుతూ పేదలకు 36 రకాల సంక్షేమ పథకాలను అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదని, అక్కడ సమస్యలను తెలుసుకొని పరిష్కరించే దిశగా ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు బి.వరలక్ష్మి, జెడ్‌పిటిసి సభ్యులు ఎం.బాబ్జీ, వైసిపి నాయకులు బి.చిట్టి రాజు, బి.శ్రీరాములు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం : మండల కేంద్రంలో యానా వీధిలో స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులను సమస్యలు అడగ్గా, తమ వీధిలో ఎవరైనా చనిపోతే కూర్చుని ఏడ్చేందుకు కనీసం స్థలంలేదని పలువురు మహిళలు వాపోయారు. వీధి ఇరుకగా ఉన్నందున తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. మాకు మార్గం చూపించాలని కోరారు. అలాగే సదరం సర్టిఫికెట్ ఇచ్చేందుకు చొరవ చూపాలని కోరారు.

పథకాల గురించి ఆరా తీస్తున్న రాజన్నదొర

గెంబల, బార్నాల వీధి, తదితర వీధుల్లో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమ పథకాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పి గౌరమ్మ, ఎంపిపి డి వెంకటరమణ నాయుడు, జడ్పిటిసి జంపు కన్నతల్లి - ఉమామహేశ్వరరావు, ఎంనిడిఒ ఎ.ప్రభాకరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు కర్రి గోవిందరావు, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ ప్రసాదరావునాయుడు, పలువురు అధికారులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

సూక్ష్మ ఆహారశుద్ధి క్రమబద్ధీకర పథకం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ఎపి ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ, జిల్లా ఆర్టికల్చర్ ఆధ్వర్యంలో ఈనెల 21న స్థానిక గిరిజన భవనంలో జరిగే ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమ క్రమబద్ధీకరణ పథకానికి సంబంధించి గోడ పత్రికను మంగళవారం స్థానిక ఎమ్మెల్యే ఎ.జోగారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్వతీపురం మన్యం వ్యవసాయ ఆధారిత ప్రాంతంగా ఉందని, ఇందులో భాగంగా ఆహార శుద్ధి పరిశ్రమల ద్వారా గ్రామీణ ప్రజల ఆర్థిక అభివృద్ధికి ఎంతో తోడ్పడుతుందని అన్నారు. అంతేకాక ఈ పథకం ద్వారా 35శాతం సబ్సిడీ పొందవచ్చన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రజలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు, వ్యాపారస్తులు, రైతు సహకార సంఘాలు రైతు, తయారీదారుల సిబ్బంది, ఐ ఆర్ పి డబ్ల్యుఎ డైరెక్టర్ ప్రకాశ్, సిబ్బంది రాజు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

విస్తారంగా సాగైన వరి

రైతు పంట పండింది..

ప్రజాశక్తి-విజయనగరం

ప్రకృతి అనుకూలత, ప్రభుత్వ సంపూర్ణ సహకారంతో ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతుల పంట పండింది. వరి సాగు విస్తీర్ణంతోపాటు దిగుబడి గణనీయంగా పెరిగింది. సగటు వరి దిగుబడిలో జిల్లాలో కొత్త రికార్డులు నమోదవుతున్నాయి. ఒకవైపు జిల్లా వ్యాప్తంగా వరి నూర్పిళ్లు జరుగుతుండగా, మరోవైపు ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభమైంది.

ఖరీఫ్‌లో వరి సాగు విస్తీర్ణం జిల్లాలో గణనీయంగా పెరిగింది. ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 2లక్షల 27వేల ఎకరాలు కాగా, ఈ ఏడాది 2,32,360 ఎకరాల్లో సాగయ్యింది. దీనికి వాతావరణం కూడా అనుకూలించింది. ఈ ఖరీఫ్ సీజనులో ఆగస్టు, నవంబరు మినహా, మిగిలిన నాలుగు నెలల్లో కూడా అధిక వర్షపాతం నమోదయ్యింది. రైతులకు ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం లభించింది. విత్తనాలు, ఎరువుల కోసం రైతులు ఎక్కడా ఎదురు చూడాల్సిన పరిస్థితి లేకుండా, ముందుగానే సరపడా స్టాకును జిల్లా యంత్రాంగం సిద్ధం చేసి అందించింది. ఎంటియు 1121, సంపద స్వర్ణ, ఎంటియు 1064, ఎంటియు 7029, బిపిటి 3291, బిపిటి 5204 తదితర రకాల వరి పంటను ఈ ఏడాది రైతులు ఎక్కువగా సాగు చేశారు. గత ఐదేళ్లతో పోలిస్తే, ఈ ఏడాది సకాలంలో పంటలు సాగు చేయడం విశేషంగా చెప్పవచ్చు.

4.63 లక్షల మెట్రిక్ టన్నులు అంచనా

ఖరీఫ్ సాగు విస్తీర్ణం పెరగడంతోపాటు, సగటు దిగుబడి కూడా ఈ ఏడాది గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం జిల్లాలో జరుగుతున్న పంటకోత ప్రయోగాల్లో ఇది స్పష్టమయ్యింది. జిల్లా వ్యాప్తంగా 2,024 పంట కోత ప్రయోగాలను నిర్వహించాల్సి ఉండగా, ఇప్పటివరకు 1,835 ప్రయోగాలు పూర్తి అయ్యాయి. సగటున ఎకరాకు 2,110 కిలోలు (26 బస్తాలు) ఉత్పత్తి వస్తుందని లెక్కగట్టారు. గత ఏడాది ప్రతికూల వాతావరణం కారణంగా సగటున ఎకరాకు 1,771 కిలోలు ఉత్పత్తి మాత్రమే నమోదయ్యిందీ. ముఖ్యంగా ఈ ఏడాది నెల్లిమర్ల, చీపురుపల్లి, మెరకముడిదాం, గుర్ల, విజయనగరం, దత్తిరాజేరు తదితర మండలాల్లో రికార్డు స్థాయిలో పంట దిగుబడి నమోద య్యింది. అక్టోబరు, నవంబరు నెలల్లో ప్రకృతి సంపూర్ణ సహకారంతో ఇది సాధ్యపడింది. దీంతో ఈ ఏడాది ఖరీఫ్‌లో విజయనగరం జిల్లాలోని 27 మండలాల్లో మొత్తంగా సుమారు 4లక్షల, 63 వేల, 128 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ, ప్రణాళికా శాఖలు అంచనా వేశాయి. ఇకవైపు చేయించుకోని రైతులు కూడా కొంతమంది ఉండటంతో, ఇది మరో 20 మెట్రిక్ టన్నుల వరకు పెరిగే అవకాశాలున్నాయి.

ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్లు

ఒకవైపు పంట నూర్పిళ్లు జోరుగా జరుగుతుండగా, మరోవైపు ధాన్యం కొనుగోలు ప్రక్రియ ఊపందుకుంది. జిల్లా వ్యాప్తంగా 510 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించగా, ప్రస్తుతం 485 కేంద్రాలు పనిచేస్తున్నాయి. ఈ కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు సుమారు 35వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. గోనె సంచుల సరఫరా నుంచి రవాణా ఏర్పాట్లను కూడా ప్రభుత్వమే నిర్వహిస్తోంది.

సమిష్టి కృషితో విజయం

ప్రజాశక్తి - పాలకొండ

సమిష్టి కృషితో రానున్న ఎన్నికల్లో విజయదుందుభి మోగించాలని వైసిపి పాలకొండ నియోజకవర్గ పరిశీలకులు డోల జగన్మోహన్‌రావు అన్నారు. మంగళవారం ఎఎంజి కన్వెక్షన్ హాల్ లో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌తో కలిసి నియోజకవర్గ స్థాయి జడ్పిటిసిలు, ఎంపిపిలు, చైర్మన్లు, కౌన్సిలర్లు, కార్పొరేషన్ డైరెక్టర్లు, ఎంపీటీసీలు, సర్పంచుల, వైఎస్‌ఆర్సీపీ ముఖ్య నాయకులతో కలిసి పార్టీ బలోపేత సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఇప్పటి నుంచి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సచివాలయాల వారీగా సమర్థవంతులైన కన్వీనర్లను, గృహ సారథులను త్వరితగతిన ఏర్పాటు చేయాలని కోరారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ వైసిపి తరపున ఎమ్మెల్యేగా కళావతిని అత్యధిక మెజారిటీతో గెలిపించి హ్యాట్రిక్ నమోదు చేయాలని కోరారు. క్షేత్రస్థాయి నుంచి ప్రతి కార్యకర్త మనోగతాన్ని అవగతం చేసుకొని వారికి సముచితమైన ప్రాధాన్యత కల్పించి సమన్వయం చేయాలని ప్రజాప్రతినిధులను కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ పరిశీలకులు జగన్మోహనరావు

22న మండల పరిషత్ సర్వ సభ సమావేశం

కురుపాం : ఈనెల 22న స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మండల పరిషత్ సర్వసభ సమావేశం ఎంపిపి శెట్టి పద్మావతి అధ్యక్షతన జరుగుతుందని ఎంపిడిఒ వివి శివరామప్ప తెలిపారు. కావున ఈ సమావేశానికి మండలంలోని ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు హాజరు కావాలని కోరారు. అలాగే మండల అధికారులు అందరూ పూర్తి సమాచారంతో రావాలని తెలిపారు.

చిరు వ్యాపారులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్

రోడ్డుపై చెత్త వేస్తే అపరాధ రుసుం

పాలకొండరూరల్ : స్థానిక నగర పంచాయతీ పరిధిలో వ్యాపారులు రోడ్డుపై చెత్త వేస్తే అపరాధ రుసుం విధిస్తామని సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ అన్నారు. మంగళవారం స్థానిక నగర పంచాయతీ పరిధిలో మెయిన్ రోడ్, దేవర పేట, నీళ్ళ టాంక్ వీధి, రెల్లివీధి, వెంకమ్మపేట, యాత వీధి, పెదకాపు వీధి, చినకాపు వీధి, మార్కెట్ ఏరియా, వీరఘట్టం రోడ్ లలో పర్యటించి శానిటేషన్ తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారులు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా ప్రతి షాపు ముందు చెత్త బుట్ట పెట్టుకొని చెత్త బుట్టలో మాత్రమే చెత్తను వేయాలని లేకుంటే అపరాద రుసుం విధిస్తామని అన్నారు. ఆయన వెంట సచివాలయ శానిటరీ కార్యదర్శులు, నగర పంచాయతీ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

తేనెటీగల దాడిలో పలువురికి గాయాలు

పాలకొండ రూరల్ : పట్టణంలోని సీతంపేట రోడ్డులో అర్‌అండ్ బి అతిథి గృహం ప్రాంతంలో తేనెటీగలు ఒక్కసారిగా రోడ్ పై వెళుతు వారిపై దాడి చేశాయి. ఈ దాడిలో అటు వైపు ప్రయాణిస్తున్న వాహనదారులు, పాదచారుల పై దాడి చేసిన ఘటనలో సుమారు 50 మందికి పైగా గాయాల పాలయ్యారు. ముఖ్యంగా ద్విచక్రవాహనంపై వెళ్తున్న వారు తేనెటీగ కంటే భయం వల్ల పడిపోయి తీవ్రంగా గాయపడ్డారు.

విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న సిఐ సత్యనారాయణ

క్రమశిక్షణతో చదివితే మంచి ఫలితాలు : సిఐ

గుమ్మలక్ష్మీపురం : విద్యార్థులు క్రమశిక్షణతో ఉండి బాగా చదువుకొని పరీక్షల్లో మంచి మార్కులు సాధించినప్పుడే బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చని ఎల్విన్‌పేట సిఐ సత్యనారాయణ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సెల్‌ఫోన్‌కు దూరంగా ఉన్న రోజే విద్య పట్ల ఆసక్తి చూపడానికి వీలుంటుందన్నారు. చదువుతో పాటు వార్తాపత్రికలు, క్విజ్, డిబేటింగ్ వంటి వాటిపై దృష్టి సారిస్తే పోటీ పరీక్షలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలని, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం విద్యార్థులు డాన్స్ పోటీల్లో పాల్గొని మంచి ప్రతిభ కనబరిచారు. కార్యక్రమంలో ఎస్ఐ షణ్ముఖరావు, కళాశాల ప్రిన్సిపల్ వేణుగోపాలరావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ సిబ్బందితో మాట్లాడుతున్న డిపిఎం షణ్ముఖరావు

చిరుధాన్యాల సాగు బహుబాగు

కురుపాం: ప్రతి గిరిజన గ్రామాల్లో చిరుధాన్యాలు సాగు చేయడమే లక్ష్యంగా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పనిచేయాలని ప్రకృతి వ్యవసాయ విభాగ డిపిఎం షణ్ముఖరాజు సూచించారు. మంగళవారం స్థానిక ఆర్‌బికెలో వాసన్ సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి జరిగిన శిక్షణా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గిరిజన గ్రామంలో చిరుధాన్యాలు సాగు చేయాలని, ఎందుకంటే రోజువారి అలవాటులో కచ్చితంగా చిరుధాన్యాలు చేర్చాలని గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలు ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడుతూ రక్త శాతం వృద్ధి చెందుతుందని అన్నారు. కార్యక్రమంలో పర్సన్స్ రవి, ఆదినారాయణ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సిసి రోడ్డు నిర్మాణం

సీతానగరం : మండలంలోని లచ్చయ్యపేట ఎస్సీ వీధిలో గల చర్చి రోడ్డుకు ఇటీవల జరిగిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాల్లో సిసి రోడ్డు కావాలని వీధి ప్రజలు ఎమ్మెల్యే ఎ. జోగారావును అడగ్గా సచివాలయాలకు కేటాయించిన నిధులతో పనులు ప్రారంభించారు. జెడ్‌పిటిసి ఎం.బాబ్జీ, ఎంపిటిసి ఎ.సింహాచలం, సర్పంచ్ సిహెచ్ కృష్ణ ఆధ్వర్యంలో తక్షణమే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ఈ నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యేకు వీధి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు మేథ్స్ టాలెంట్ టెస్ట్

బలిజిపేట : మండలంలోని తుమరాడలో శ్రీ భారతీ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో 6 నుంచి 9 విద్యార్థులు మేథ్స్ టాలెంట్ టెస్ట్ ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జగన్మోహన్ అధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ ఈనెల 22న జాతీయ గణిత దినోత్సవ సందర్భంగా ఈ టెస్ట్ ను నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

రిటర్నింగ్ వాల్ నిర్మాణానికి నిధులు

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని కేదారి పురం - వంగర గ్రామాలకు వెళ్లే ఘాట్ రోడ్ రిటర్నింగ్ వాల్ నిర్మాణానికి ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి చొరవతో రూ.4 లక్షలు మంజూరయ్యాయి. వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు రిటర్నింగ్ వాల్ కూలిపోయింది. స్పందించిన ఎమ్మెల్యే ఆర్ అండ్ బి అధికారులతో మాట్లాడి ప్రతిపాదనలు పంపించమని ఆదేశించి నిధులు మంజూరు అయ్యేలా కృషి చేశారు. పది రోజుల్లో టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామని ఆర్ అండ్ బి డిఇ మోహన్‌రావు తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

సీతానగరం : మండలంలోని సుమిత్రాపురం, పెదంకలం రైతు భరోసా కేంద్రాల వద్ద ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం మండల వ్యవసాయ శాఖ అధికారి ఎస్.అవినాష్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళ్లాల్లో ఉండే ధాన్యాన్ని మిల్లులకు తీసుకెళ్లేందుకు రవాణా ఛార్జీలు, తదితర అంశాలను రైతులతో చర్చించారు. ధాన్యం మిల్లులకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రతి రైతు ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు రైతు భరోసా కేంద్రాల ద్వారా తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచులు బి.ఉమామహేశ్వరరావు, బి.శ్రీనివాసరావు, రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నూర్చిన ధాన్యం పరిశీలిస్తున్న ఎఒ

సిఎం జన్మదినం సందర్భంగా...

పలుచోట్ల జగనన్న పచ్చతోరణం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే కళావతి

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని పలుచోట్ల జగనన్న పచ్చతోరణం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అలాగే విద్యార్థులకు ఆటలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు.

ప్రజాశక్తి - సాలూరు రూరల్

మండలంలోని తోణాం పంచాయతీ పరిధిలో గల గిరిజన ఆశ్రమం ఉన్నత పాఠశాల ఆవరణలో ఉపముఖ్యమంత్రి పి.రాజన్న మొక్కల నాటే కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఎంపిపి జి.రాములమ్మ, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, సువ్వాడ గుణావతి, వైసిపి నాయకులు దండి శ్రీనివాసరావు, సర్పంచ్ మొగల ఆదయ్య, సువ్వాడ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సాలూరు : డిప్యూటీ సీఎం రాజన్నదొర పట్టణ పరిధిలోని పిఎన్ బొడ్డవలస బాలయోగి గురుకుల సాంఘిక సంక్షేమ ఆశ్రమ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. మండలంలోని తోణాం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలోనూ మొక్కలు నాటారు. డిఎఫ్ఓ జివిటి ప్రసూన, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కె.రామారావు ఆయన వెంట వున్నారు. బుధవారం సిఎం జగన్ జన్మదినం సందర్భంగా శివాలయం వీధిలో ఉన్న సీతారామ ధర్మశాలలో నిర్వహించనున్న రక్తదాన శిబిరంలో రక్తదానం చేయడానికి యువకులు ముందుకు రావాలని డిప్యూటీ సీఎం రాజన్నదొర కోరారు.

పార్వతీపురంటౌన్ : పార్వతీపురంలో మంగళవారం స్థానిక జిల్లా ఆసుపత్రి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రధాన రహదారి ప్రాంగణంలో స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని నియోజకవర్గంలో గత రెండు రోజులుగా పలు కార్యక్రమాలు నిర్వహించామన్నారు. బుధవారం భారీ రక్తదాన శిబిరంతో పాటు కేక్ కటింగ్, సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరేశ్వరి, వైస్ చైర్ పర్సన్ కొండపల్లి రుక్మిణి, ఇండుపూరు గున్నేశ్వరరావుమున్సిపల్ కమిషనర్ జె. రామప్పలనాయుడు, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, ఎంపిపి మజ్జి శోభారాణి, వైస్ ఎంపిపి సిద్ధ జగన్నాధ రావు, మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు బొమ్మి రమేష్,కొండపల్లి బాలకృష్ణ, స్థానిక కౌన్సిలర్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, నియోజకవర్గ స్థాయి వైసిపి సీనియర్ నాయకులు, స్టేట్ డైరెక్టర్లు, కార్యకర్తలు, నియోజకవర్గ స్థాయి క్రీడాకారులు, అభిమానులు, పాల్గొన్నారు.

బలిజిపేట : విజేతలకు బహుమతులు అందజేస్తున్న రమాదేవి

బలిజిపేట : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు సందర్భంగా మండలంలోని చిలకపల్లిలో గల రంగుముద్రి డిగ్రీ, జూనియర్ కళాశాల్లో విద్యార్థిని విద్యార్థులకు ఆటలు, ముగ్గుల పోటీలు బిసి దాసరి కార్పొరేషన్ చైర్‌పర్సన్ రంగుముద్రి రమాదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఆసక్తి గల విద్యార్థులను రక్తదాన శిబిరాలకు పంపినట్టు కాలేజీ యాజమాన్యం తెలిపింది. కార్యక్రమంలో రంగుముద్రి విద్యాసంస్థల అధినేత రంగుముద్రి గణపతిరావు, కూరాకుల, పొందర కార్పొరేషన్ డైరెక్టర్ కర్రి రమణమ్మ, కూర్మారావు, ప్రిన్సిపాళ్లు గణపతిరావు, సత్యనారాయణ తది తరులు పాల్గొన్నారు.

కురుపాం : జగనన్న గ్రీన్ ఫీల్డ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలో నీలకంఠాపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు గోవిందరావు ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ ఎ.మన్మధరావు ముఖ్యఅతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఒక మొక్కను నాటితే అది భావితరాల భవిష్యత్తుకు ఎంతగానో ఉపయోగపడుతుందని, పాఠశాలలో 80 మొక్కలు నాటామని, మొక్కలను పెంచే బాధ్యత పరిరక్షణ కూడా చూడడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్ ఎన్. వెంకట్రావు, వసతి గృహం సంక్షేమాధికారి మల్లేశ్వరరావు అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

సీతంపేట : సిఎం జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో భాగంగా మండలంలోని పెద్దూరు పంచాయతీ వలగెడ్డలో వాలీబాల్ పోటీలు స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడాకారులు జాతీయ, రాష్ట్ర స్థాయికి ఎదగాలన్నారు. క్రీడాకారులకు జగనన్న సహకరిస్తారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపిపి ఆదినారాయణ, సర్పంచ్ ఆదిలక్ష్మి, జడ్పిటిసి లక్ష్మి, ఎఎంసి చైర్మన్ మోహన్‌రావు, జెడ్‌పిటిసి ప్రతినిధి రాము తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ రూరల్ : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురష్కరించుకొని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రాథమిక హక్కులు-పరిరక్షణ అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 9 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, నియోజకవర్గ పరిశీలకులు డోల జగన్మోహన్, నగర పంచాయతీ చైర్మన్ యందవ రాధా కుమారి పాల్గొన్నారు. ఈ పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

టిడిపి అభివృద్ధికి కృషి : శత్రుచర్ల

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

కురుపాం నియోజకవర్గ టిడిపి నాయకులంతా కలిసికట్టుగా పని పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్సీ శత్రుచర్ల విజయరామరాజు పిలుపునిచ్చారు. మంగళవారం చిన మేరంగిలో శత్రుచర్ల నివాసంలో టిడిపి సమన్వయ కమిటీ సభ్యులు యూనిట్ ఇన్చార్జులు, బూత్ ఇన్చార్జులు, క్లస్టర్ ఇన్చార్జులకు ఒక్కరోజు శిక్షణ శిబిరం జరిగింది. ఈ శిబిరంలో శత్రుచర్ల మాట్లాడుతూ కురుపాం నియోజకవర్గంలో టిడిపి బలంగా ఉందని, రానున్న రోజుల్లో నాయకులు, కార్యకర్తలు కష్టపడి పని చేస్తే నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి అత్యధిక మెజార్టీతో గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి టి.జగదీశ్వరి మాట్లాడుతూ సమన్వయ కమిటీ సభ్యులు, పార్టీ నియమించిన వివిధ విభాగాల ఇన్చార్జులు కలిసికట్టుగా పనిచేసి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. నియోజకవర్గం లో టిడిపి జెండా ఎగురవేయాలని, పార్టీ అభ్యర్థి విజయం సాధించడానికి ప్రయత్నం చేయాలని ఆమె కోరారు. శిక్షణ శిబిరంలో అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకష్ణ, నియోజకవర్గస్థాయి సమన్వయ కమిటీ సభ్యులు పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ విభాగాల పార్టీ ఇన్చార్జిలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

హెచ్ఎంలను బోధనేతర విధుల నుంచి తప్పించాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ప్రధానోపాధ్యాయులను బోధ నేతర విధుల నుంచి తప్పించాలని జనసేన నాయకులు కోరారు. జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ ఎస్.డి.వి.రమణను జనసేన నాయకులు అనిల్ కుమార్, వంగల దాలినాయుడు, రాజాన రాంబాబు, సిరిపరపు గౌరీ శంకర్, , బార్నాల పవన్ తదితరులు మంగళవారం కలిసి పాఠశాలల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులను బోధనేతర విధులు నిర్వహిస్తుండడం వల్ల పాఠశాల పరిపాలన, పాఠ్యాంశాలు బోధనపై దష్టి సారించలేరన్నారు. అలాగే నాణ్యత లేదంటూ విద్యార్థులు రిటర్న్ చేసిన బ్యాగులను ఇప్పించాలన్నారు. పాఠశాలల్లో టీచర్ల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలకు ఇవ్వాల్సిన గ్రాంట్లు సకాలంలో ఇవ్వాలన్నారు. నాడు నేడు పనులు వేగవంతం చేసి సకాలంలో పాఠశాలల్లో వసతులు కల్పించాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం మెనూ ప్రకారం అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం డిఇఒ మాట్లాడుతూ పాఠశాల గ్రాంట్లు నిధులు విడుదల చేశామని, బ్యాగులను విద్యార్ధులెవరూ తిరిగి ఇవ్వలేదని,ఉపాధ్యాయుల కొరత పాఠశాలలో లేదని హెడ్మాస్టర్లు, తమ పాఠశాల బాగు కోసం బోధనేతర విధులు నిర్వర్తించడంలో తప్పులేదని అన్నారు. సమస్యలు ఏమైనా ఉంటే వాటి పరిష్కరించెందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని హామీ ఇచ్చారు.

మోసకారి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలి

ప్రజాశక్తి - పాచిపెంట

మోసకారి జగన్ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు గుమ్మడి సంధ్యారాణి అన్నారు. మండలంలోని మోసూరు పంచాయతీ జింకాడ వలస, సురగడ వలస, మోసూరులో మంగళవారం టిడిపి నాయకులు చల్లా కనక ఆధ్వర్యంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సంధ్యారాణి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో మోసకారి వైసిపి ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పి గద్దెదించాలని కోరారు. మూడున్నరేళ్ల పాలనలో వైసిపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు అన్ని రకాలుగా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. రోజురోజుకు పెరుగుతున్న ధరలతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఆర్థికంగా చితికి పోతున్నారని, గిరిజనుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని అన్నారు. కార్యక్రమంలో మక్కువ, సాలూరు మండలాల టిడిపి అధ్యక్షులు గుల్ల వేణు, నిమ్మాది చిట్టి, పాంచాలి సర్పంచ్ జి.యుగంధర్, ముఖీ సూర్యనారాయణ, కె.సురేష్, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : గరుగుబిల్లిలో ర్యాలీ చేస్తున్న టిడిపి నాయకులు

గరుగుబిల్లిలో ఇదేం కర్మ

గుమ్మలక్ష్మీపురం : గరుగుబిల్లి మండల కేంద్రంలో ఇదేం కర్మ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి టి.జగదీశ్వరి మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి, నిత్యాసర వస్తువుల ధరలు పెరుగుదల, కరెంటు బిల్లులు పెరుగుదల, బస్సు ఛార్జీల పెంపుపై ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు అక్కేన మధుసూదనరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టిడిపి బిసి విభాగం అధికార ప్రతినిధి ఎం.పురుషోత్తమ నాయుడు, అరకు జిల్లా బిసి విభాగం కార్యదర్శి అంబటి రాంబాబు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడ్ల శ్రీనివాసరావు, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు కోట సుమన్, మండల తెలుగు యువత అధ్యక్షులు బి.జగదీష్, ఎ.గంగాధర్ నాయుడు, బి.నారాయణస్వామి, కిషోర్, ఎడ్ల హరి, ఎం.రామారావు, తుమ్మగుంట త్రినాథ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆరోగ్యపరీక్ష చేస్తున్న వైద్యాధికారి అమరసింహారెడ్డి

గిరి శిఖర గ్రామాల్లో ఫ్యామిలీ ఫిజీషియన్

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని గిరిశిఖర గ్రామమైన టొంనలపాలపాడులో 104 అధ్వర్యంలో మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కన్సెప్ట్ నిర్వహించారు. వైద్యాధికారి అమర సింహరెడ్డి 37మందికి వైద్య సేవలు అందించారు. అనంతరం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. శారీరక ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో 104 సిబ్బంది, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పి.రోషిణి, హెల్త్ అసిస్టెంట్ తిరుపతి, ఎఎన్ఎం ఊర్వశి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అదనపు డోసు టీకా వేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్

సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో ఎఫ్ఐపివి వాక్సిన్ అదనపు డోసు టీకా వేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు తెలిపారు. సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో భాగంగా కొత్తగా ప్రవేశపెట్టనున్న మూడో డోసు ఎఫ్ ఐపివి వ్యాక్సిన్‌పై మంగళవారం వైద్యాధికారులతో జిల్లా ఆసుపత్రి సమావేశ భవనంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి అధ్యక్షతన శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలియో నిర్మూలనలో భాగంగా ప్రస్తుతం చిన్న పిల్లల్లో వేస్తున్న ఓరల్ పోలియో, ఐపివి టీకాలతో పాటు అదనపు డోసు 9 నెలల వయసులో ఎఫ్ఐపివిని వేయాలన్నారు. ఈ ఎఫ్ఐపివిని పిల్లలకు 6 వారాలు , 14 వారాలు వయసులో వేస్తున్నామని వైద్య ఆరోగ్య శాఖ సూచనలు మేరకు వచ్చే సంవత్సరం జనవరి 1 నుంచి అదనపు డోసు పిల్లలకు 9 నెలల వయసులో వేయాల్సి ఉంటుందని తెలిపారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు మాటాడుతూ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం షెడ్యూల్ ప్రకారం క్రమం తప్పకుండా నిర్వహించాలని, కొత్తగా ప్రవేశపెట్టిన మూడో డోసు ఎఫ్ఐపివి వ్యాక్సిన్‌కు సంబంధించి అర్హుల జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. డబ్ల్యూహెచ్ఒ ప్రతినిధి డాక్టర్ జ్యోత్స్న కిరణ్ టీకాల కార్యక్రమం గురించి శిక్షణను ఇచ్చి వాటి వల్ల ప్రయోజనాలను వైద్యాధికారులకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్‌బిఎస్‌కె సమన్వయాధికారి డాక్టర్ ధవళ భాస్కరరావు, పార్వతీపురం, సీతంపేట డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సి. దుర్గ కల్యాణి , కె.విజయ పార్వతి, ప్రోగ్రాం అధికారి డాక్టర్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారికి వినతిని అందజేస్తున్న సిహెచ్‌డబ్ల్యులు, సిఐటియు నాయకులు

సమస్యల పరిష్కారం కోరుతూ సిహెచ్‌డబ్ల్యుల వినతి

ప్రజాశక్తి - పాచిపెంట

కనీసవేతనంతో పాటు న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని హెల్త్ కమ్యూనిటీ వర్కర్లు స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి వెంకటరమణకు మంగళవారం వినతిని అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు టి.ప్రభావతి, కోరాడ ఈశ్వరరావు, నాయకులు పి.నారాయణమ్మ మాట్లాడుతూ ఆశా వర్కర్లతో సమానంగా ప్రభుత్వ వైద్య సేవలందిస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను చిన్నచూపు చూడడం సరైంది కాదని, ఇప్పటికైనా ఆశాలతో సమానమైన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. యూనిఫాంలు, గ్లౌజులు, మాస్కులు అందించాలన్నారు. అర్హులైన వారిని ఆశా వర్కర్లుగా ప్రమోట్ చేయాలన్నారు. 8 నెలలుగా వేతనాలు చెల్లించకపోవడం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే సిహెచ్‌డబ్ల్యుకు నెలనెలా వేతనాలు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. రాజకీయ వేధింపులు మానుకోవాలని విజ్ఞప్తి చేశారు. పై సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 22న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు పాల్గొన్నారు.

నంద ప్రాథమిక పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న వాటర్‌ప్లాంట్

దిష్టిబొమ్మలా ఆర్ ప్లాంట్లు

ప్రజాశక్తి - మక్కువ

నాడు - నేడు కింద పాఠశాలలకు ప్రభుత్వం మంజూరు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్లు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరందించే లక్ష్యంతో వేలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసి మినరల్ వాటర్ ప్లాంట్లు చాలా వరకు మరమ్మతులకు గురయ్యాయి. ఏర్పాటు చేసిన కొద్దిరోజులకే ఇవి మూలకు చేరడంతో నిరుపయోగంగా దిష్టిబొమ్మలా దర్శనమిస్తున్నాయి. వీటిని మరమ్మతులు చేపట్టాలని పలువురు అధికారులకు తెలిపినా పట్టించుకోవడంలేదు. దీంతో విద్యార్థులు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి మరమ్మతులకు గురైన వాటర్‌ప్లాంట్లను మరమ్మతు చేసి స్వచ్ఛమైన తాగునీరందించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

భార్య మందలించిందని ఆత్మహత్య

ప్రజాశక్తి - పాచిపెంట

భార్య మందలించిందని భర్త పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల అందించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని గడివలసకు చెందిన బెవర చక్రధర్ (31)కు భార్య పార్వతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. చక్రధర్ మద్యానికి బానిసై భార్యా, పిల్లలను పట్టించుకునే వాడు కాదు. గత నెల 30న మద్యం సేవించి చక్రధర్ ఇంటికి వచ్చాడు. తాగొచ్చిని చక్రధర్‌ను భార్య మందులించడంతో అదే రోజు పొలంలో గల పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న ఆయన్ను గుర్తించిన కుటుంబీకులు ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స అందించారు. దీంతో ఆరోగ్యం కొంతమేరకు మెరుగుపడడంతో మళ్లీ మద్యం సేవించడంతో ఆరోగ్యం క్షీణించింది. ఈనెల 17న విశాఖ కెజిహెచ్‌లో చేర్పించారు. మంగళవారం వేకువజామున 4గంటలకు చికిత్స పొందుతూ చక్రధర్ మృతి చెందాడని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ ముసలయ్య తెలిపారు.

మృతి చెందిన చక్రధర్

ఎమ్మెల్యేకు సమస్యను వివరిస్తున్న మహిళలు

గోడను తొలగించాలని వినతి

వీరఘట్టం : స్థానిక పాత మండల పరిషత్ కార్యాలయం వద్ద అడ్డంగా నిర్మించిన గోడను తొలగించాలని మంగళవారం స్థానిక ఎమ్మెల్యే వి కళావతికి యానాది వీధికి చెందిన పలువురు మహిళలు విన్నవించుకున్నారు. ఇక్కడ అడ్డంగా గోడ నిర్మాణ పనులు చేపట్టడం వల్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని అన్నారు. రెండు అడుగుల్లో సమీపంలో ఉన్న కాయగూరలు మార్కెట్కు వెళ్లేందుకు గోడ నిర్మాణం పనుల వల్ల 200 అడుగులు దూరం నడవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. కావున గోడను తొలగించాలని మహిళలు కోరారు.